

కుటుంబ సమేతంగా బాణసంచా కాలుస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

హెల్త్.. వెల్త్.. హ్యాపీనే లక్ష్యం

పోలీసుల గౌరవం పెంచుతాను

- పోలీసులది ఉద్యోగం కాదు నిస్వార్థ సేవ
- అమరవీరుల సంస్మరణ దినంలో సీఎం చంద్రబాబు
- మంగళగిరి బెటాలియన్‌లో అట్టహాసంగా కార్యక్రమాలు



అమర వీరులకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

మంగళగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హెల్త్, వెల్త్, హ్యాపీనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ గ్రౌండులో మంగళవారం అట్టహాసంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా తొలుత ముఖ్యమంత్రి పోలీసు మృతవీరుల స్మారక స్థూపానికి నివాళులను అర్పించారు. ఆ తర్వాత పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించి, అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీ‌ష్‌కుమార్, శాంతిభద్రతల విభాగం అడిషనల్ డీజీ మధుసూదనరెడ్డిలతో ముఖ్యమంత్రి కలిసి సందర్శించారు. బెటాలియన్‌కు వచ్చిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో పోలీసులను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న పోలీసులంటే తన కెప్పుడు గౌరవమేనని చెప్పారు. పోలీసుల గౌరవాన్ని పెంచడంతోపాటు వారి కుటుంబాల సంక్షేమ బాధ్యతలను తమ ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. పోలీసుల త్యాగాలను, బలి దానాలను జాతి గుర్తుంచుకుంటూ వారి నుంచి స్ఫూర్తిని పొందుతుందని చెప్పారు. పోలీసులు చేసేది ఉద్యోగం అనేకన్నా నిస్వార్థ సేవ అనడం సరైనదని చంద్రబాబు చెప్పారు. ఏపీ పోలీసు అంటే ఓ బ్రాండ్ అని, దానికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలని కోరారు. ప్రస్తుత తరుణంలో పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక సేవలో మానవత్వాన్ని చూపుతూనే అక్రమార్కులు, తప్పుడుపనులు చేసేవారి విషయంలో పోలీసు అంటేనే భయం కలిగేలా కఠినంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడాలంటే భయపడేలా పోలీసులు సాంకేతికతలో అప్‌డేట్ అవుతుండాలన్నారు.

పోలీసు త్యాగాలను స్మరించుకోవాలి

అమరవీరుల సంస్మరణ దినంలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్ల పట్టణ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగించారు. పోలీసు అమరవీరుల ధైర్యం, త్యాగం, కర్తవ్య నిబద్ధత వల్లే సమాజం శాంతిభద్రతలతో జీవిస్తుందన్నారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులతో సహకరిస్తే సమాజం మరింత సురక్షితంగా ఉంటుందన్నారు. పోలీసుశాఖ దేశ అంతర్గత భద్రతకు మూలస్తంభమన్నారు. ప్రజాస్వామ్యానికి పోలీసులు రక్షకులని తెలిపారు. రాత్రి పగలు అన్న తేడా లేకుండా నిరంతం అప్రమత్తంగా ఉంటూ సమాజం సజావుగా నడవటానికి పోలీసులు కృషి చేస్తారని చెప్పారు. చట్టాల అమల్లో కాదని ప్రజల్లో నమ్మకాన్ని బలోపేతం చేసుకోవడంలోనే పోలీసింగ్ ఉందన్నారు. అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అంతకముందు స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, డీఎస్పీలు జి.రామాంజనేయులు, శ్రీనివాసరావు, ఎండీ మొయిన్, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.



బాపట్ల : అమరవీరుల కుటుంబాలను సత్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్



దీపావళి.. ఆనందకేళి

- వెలుగులతో నిండిన పండుగ
- టపాకాయలు కాల్చి చిన్నాపెద్ద సంబరం

(బాపట్ల, రేపల్లె, చీరాల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సోమవారం దీపావళి పండుగను ప్రజలు అట్టహాసంగా జరుపుకున్నారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా దీపావళిని ఓ వేడుకగా నిర్వహించుకున్నారు. మహిళలు దీపాలు, పూలతో సుందరంగా అలంకరించగా లోగిళ్ల వెలుగులు విరజిమ్మాయి. చిన్నారులు ఉదయం నుంచే టపాకాయలు కాలుస్తూ సందడి చేశారు. రంగు రంగుల బాణసంచా వెలుగులతో పట్టణాలు, పల్లెలు నిండిపోయాయి. బాణసంచా వెలుగులు కనువిందు చేశాయి. జిల్లా అంతటా దీపావళి శోభ సంతరించుకుంది. టపాసుల మోతలతో వీధులు హోరెత్తిపోయాయి. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ టపాకాయలు పేలుస్తూ ఆనందంలో మునిగితేలారు. దీపావళి సందర్భంగా ఇంటింటా.. వ్యాపార సంస్థల్లో లక్ష్మీ పూజలు ఘనంగా జరిగాయి. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. గృహాలు, వ్యాపార సంస్థలు రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. జిల్లాలో ఎక్కడా ప్రమాద ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, ఆనందోత్సాహాల నడుమ దీపావళి పర్వదినం ముగిసింది.



విద్యుత్ వెలుగుల్లో ఆలయ గోపురం

నేటి నుంచి కార్తీక మాసం

అమరేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బుధవారం నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాసం పురస్కరించుకుని ప్రథమ ఆరామమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నదీతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఈ క్రమంలో భక్తులు ఎటువంటి ఇబ్బం దులు పడకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలను ఏర్పాటు చేసి ఎండ నుంచి రక్షణకు ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేశారు. స్నానఘాట్ వద్ద మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన గాలిగోపురంతో పాటు ఉపాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేలవాలిన వరి

వేమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రైతులు వణికిపోతున్నారు. ఈదురుగాలులకు ఇప్పటికే పలు ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరిపైరు నేలవాలింది. వేమూరు మండల పరిధిలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం పడింది. దీంతో కోతకు సిద్ధమైన, పొట్ట దశలో ఉన్న, పాలు పోసుకుంటున్న దశలోని పైర్లు పడిపోయాయి.



చంపాడు వద్ద నేలకొరిగిన వరిపైర్లు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సుగుణమణి

త్రోబాల్ జట్టులో యాజలి విద్యార్థులు

- 24 నుంచి అహ్మదాబాద్‌లో జాతీయ స్థాయి పోటీలు

కర్లపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఈ నెల 24 నుంచి 26 వరకు అహ్మదాబాద్‌లో జరిగే జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు యాజలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు సుగుణమణి తెలిపారు. పాఠశాలకు చెందిన కె.తిరుపతమ్మ, ఏ.హాసిని, కె.శ్రీవల్లి, డి.దినేష్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరిని మంగళవారం విద్యాకమిటీ చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్లు, పీడీ మెర్సీ తదితరులు అభినందించారన్నారు.

12 ఏళ్లకు కొత్తపేటలో ఎన్నికల సందడి

- రేపటి నుంచి నామినేషన్లు, వచ్చే నెల 3న ఎన్నికలు

చీరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ఎన్నికలకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 23 నుంచి మొదలై 25తో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది. 26న స్ర్కూటీ్ని, అప్పీలు అవకాశం కల్పించారు. 29 మధ్యాహ్నం నుంచి పోటీలోని అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. అనంతరం నవంబరు 3న ఉదయం 7 గంటల ఓటింగ్, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు విడుదల చేయనున్నారు. షెడ్యూల్ ప్రకటనతో గ్రామంలో ఎన్నికల కోలాహలం మొదలైంది. గ్రామంలో సుమారు 11 వేలకు పైగా ఓటర్లు ఉండగా 16 వార్డులు ఉన్నాయి. గ్రామంలో 2013లో ఎన్నికలు జరిగాయి. అనంతరం 2018లో ఎన్నికలు జరగాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాలతో ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. 2019లో అప్పటి ప్రభుత్వం బైఫరకేషన్ ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలో పట్టణానికి సమీపంలో ఉండే కొత్తపేటలోని ప్రసాద్‌నగర్‌లో కొంత భాగం, రోశయ్య కాలనీ, ప్రతిభ భారతినగర్, వడ్డె సంఘం ప్రాంతాలు సుదూర ప్రాంతమైన పాపాయిపాలెంలో కలిపారు. భౌగోళికంగా వాడరేవు పంచాయతీలో ఉన్న కీర్తివారిపాలేన్ని సుమారు 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న బుర్లవారిపాలెంలో కలిపారు. ఈ ప్రకారం 2020లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ కూడా జారీ చేయగా కీర్తివారిపాలెం పీడీసీసీ బ్యాంకు మాజీ డైరక్టర్ గడ్డం శ్రీనివాసరావు, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరి వాసు వేర్వేరుగా కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు నిలిచాయి.వేటపాలెం మండలం రామన్నపేటపై బైఫరకేషన్ ఇబ్బందులు లేకపోవడంతో ఆ పంచాయతీలో మాత్రం ఎన్నికలు జరిగాయి. నాలుగు నెలలకే కోర్టు తీర్పు ఇచ్చినా పాత పద్ధతిలో గ్రామాల్లో ఎన్నికలు జరగలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో తాజా నోటిఫికేషన్‌తో గ్రామంలో 12 ఏళ్ల తరువాత ఎన్నికల సందడి నెలకుంది.



కొత్తపేట పంచాయతీ కార్యాలయం

ఇప్పటికే రూ.100 కోట్లు నష్టం

2013 తర్వాత నుంచి పంచాయతీ ఎన్నికలు జరగక పోవడంతో నియోజకవర్గంలోని మేజర్, చిన్న పంచాయతీలకు రావాల్సిన సుమారు రూ.100 కోట్లు నిధులు కోల్పోయాయి. కాలక్రమేణ నిధులు కొరతతో తాగునీటి వసతులతో సహా అన్నిరకాల మౌలిక వసతులు సైతం కనుమరుగయ్యాయి. రహదారులు సరి లేవు. విద్యుత్ దీపాల వెలుగులు లేవు. చిన్న గ్రామాల్లో అయితే పరిస్థితులు మరీ దారుణంగా మారాయి.

నిర్లక్ష్యం నోటీసులు

- పింఛన్ల పంపిణీలో అలసత్వంపై చర్యలు
- సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం కన్నెర్ర
- మూడు జిల్లాల్లో 153 మందికి షోకాజ్ నోటీసులు

బాపట్ల జిల్లాలో 17 మందికి

అక్టోబరు నెలకు సంబంధించి పెన్షన్ల కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగుల్లో రాష్ట్రంలో పల్నాడు జిల్లాలో అత్య ధికంగా ఉన్నారు. పల్నాడు జిల్లా లో 79 మంది, గుంటూరు జిల్లా లో 57 మంది, బాపట్ల జిల్లాలో 17 మంది పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధి కారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా ఉద్యోగులకు ఆదేశాలు అందాయి. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు.



బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఒక టో తేదీన ఉదయాన్నే, ఆ రోజు సెలవు అయి తే ముందు రోజునే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ మొత్తం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పంపిణీ బాధ్యత సచివాలయ ఉద్యోగులది. అయితే కొందరు ఉద్యోగులు ఇది తమ పని కాదని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా పలువురు పట్టించుకోకుండా తమ ధోరణిని వీడటంలేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం విధుల్లో నిర్లక్ష్యంపై కన్నెర్ర చేసింది. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర డైరెక్టర్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నెల 1న ఉదయం 7 గంటలకు పెన్షన్ పంపిణీ ప్రక్రియను ప్రారంభించని వారితో పాటు, లబ్ధిదారులను కార్యాలయానికి పిలిపించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ లెక్కన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి 153 మంది ఉద్యోగులపై చర్యలకు రంగం సిద్ధం చేశారు.

బహిష్కరించామని చెప్పారు..

తమ డిమాండ్ల పరిష్కారం కోసం సచివాలయ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మాత్రం యథావిధిగా నిర్వహించాలని నిర్ణయించారు. కొన్ని ఉద్యోగ సంఘాలు మాత్రం పెన్షన్లు పంపిణీ నిలుపుదల చేస్తే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావచ్చని చెప్పింది. ఈ సంఘాల నేతల ఉచ్చులో కొందరు సచివాలయ ఉద్యోగులు చిక్కుకున్నారు. పింఛన్ల పంపిణీ సాఫీగా జరగాలని అధికారులు హెచ్చరిక జారీ చేసినా పట్టించుకోలేదు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం సహా పలు ప్రాంతాల్లో కార్యాలయం వద్దకు వచ్చి పెన్షన్లు తీసుకోవాలని మైకుల్లో ప్రచారం చేయించారు. ఇలాంటి వ్యవహారాలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీంతో బాధ్యులైన ఉద్యోగులపై చర్యలకు ఆదేశించింది.

తల్లడిల్లిన జనకవరం

- తెలంగాణలో బిడ్డల్ని చంపి తల్లి ఆత్మహత్య
- మృతదేహాల కోసం బంధువుల ఎదురుచూపు
- పనులకు వెళ్లిన దంపతుల మధ్య ఘర్షణతో.. దారుణం



గ్రామంలోని రమేష్ స్వగృహం



పిల్లలతో నాగలక్ష్మి (ఫైల్‌ఫొటో)

పంగులూరు, అక్టోబరు 21 (ఆంధ్రజోతి): ఊరు నుంచి పిల్లలతో కలిసి పనులకు వెళ్లారు.. సుదూరంగా ఉంటున్నా భార్యాభర్తలు సంతోషంగా ఉంటున్నారని బంధువులు భావించారు. దీపావళి సంబరాల్లో మునిగితేలిన బంధువులు, గ్రామస్థులు దారుణ ఘటన సమాచారంతో తల్లడిల్లారు. తల్లి పిల్లల్ని హతమార్చి ఆత్మహత్య చేసుకున్న ఘటనతో మండలంలోని జనకవరం వాసులు కలవరం చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. జనకవరం గ్రామానికి చెందిన కుంచాల రమేష్, నాగ లక్ష్మి (27) భార్యభర్తలు. వీరికి అవంతిక(9), భువన సాయి(7) అనే ఇద్దరు సంతానం ఉన్నా రు. రమేష్ భార్య పిల్లలతో కలిసి కొన్నేళ్ళుగా తెలంగాణలోని నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి గ్రామంలో నివాసం ఉంటూ బేల్దారి పనులతో జీవనం వెళ్లదీస్తున్నారు. పిల్లలు అక్కడే పాఠశాలలో చదువుకుం టున్నారు. ఈ నెల 19న ఆదివారం దంపతులు గొడవపడ్డారు. దీంతో భర్త రమేష్ భార్యకి చెప్ప కుండా స్వగ్రామమైన జనకవరం చేరుకున్నాడు. అయితే భర్త ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కలత చెందిన భార్య నాగలక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు ఆమెకు చెప్పారు. దీంతో ఇంటికి చేరుకున్న నాగలక్ష్మి సోమవారం తెల్లవారు జామున ఇద్దరు పిల్లల్ని చంపి తను ఉరి వేసుకొంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం జనకవరంలోని కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు గ్రామస్థులకు తెలియడంతో గ్రామంలో రోదనలు మిన్నం టాయి. అందరూ పండుగ సంబరాల్లో ఉండగా తల్లి, బిడ్డల మరణవార్త తెలియడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకుంది. దంపతుల మధ్య మనస్పర్థలు ఇంతటి దారుణ ఘటనకు దారితీయడంతో బంధువులు, గ్రామస్థులు విస్మయం చెందుతున్నారు. తల్లి, చిన్నారుల మృతదేహాల కోసం విషన్న వదనాలతో ఎదురుచూస్తున్నారు.



ధగధగలాడే బంగారం డ్రస్

బంగారంతో ఆభరణాలతో పాటు దుస్తులూ రూపొందుతూ ఉంటాయి. తాజాగా దుబాయ్‌కు చెందిన అల్ రొమోజాన్ ఆభరణాల బ్రాండ్... పది కిలోల బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల ఖరీదైన 'దుబాయ్ డ్రస్'ను రూపొందించింది. ఇలాంటి బంగారం దుస్తుల స్ఫూర్తితో ట్రెండ్‌గా మారిపోతున్న గోల్డెన్ డ్రస్సుల మీద ఓ లుక్కేద్దామా...

9.5 కోట్ల డ్రస్

విలాసాలకూ, సంపదకూ పేరు పొందిన దుబాయ్ తాజాగా 21 క్యారెట్ల మేలిమి బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల రూపాయల విలువైన బంగారం డ్రస్‌ను రూపొందించి, గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. పది కిలోల బరువున్న ఈ డ్రస్ ప్రపంచంలోనే అత్యంత బరువైన, విలువైన డ్రస్‌గా పేరు తెచ్చుకుంది. ఒక బంగారు కిరీటం, నెక్లెస్, నడుముకు తగిలించుకునే హియార్ అనే ఆభరణం లాంటి అదనపు హంగులు కూడా ఈ డ్రస్‌కు తోడవడం విశేషం. ఎమిరాటి సంస్కృతిని ప్రతిబింబించేలా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చరిత్ర, వారసత్వాలకు అద్దం పడుతూ చక్కని పనితనంతో, ఆకృతులతో ఈ డ్రస్‌ను ఎంతో కళాత్మకంగా రూపొందించారు.



బంగారం ప్రియులను అలరించేలా...

ఈ దుస్తులకు తగ్గట్టుగా రూపొందించిన బంగారం టియారా 398 గ్రాముల బరువుంటే, నెక్లెస్ ఏకంగా 8,810 గ్రాముల బరువుంది. ఇయర్ రింగ్స్ 134 గ్రాముల బరువున్నాయి. ఇలాంటి అత్యంత బరువైన, విలువైన బంగారం డ్రస్ రూపకల్పన... ప్రపంచ నాయకత్వాన్ని చాటుకోవాలనే యుఎఇ ఆశయం ప్రతిబింబించడంతో పాటు దుబాయ్ నగరం... బంగారు ఆభరణాల ప్రియుల ప్రధాన గమ్య స్థానంగా ప్రత్యేక గుర్తింపును కూడా పొందగలిగింది. షార్జాలో జరిగిన 56వ మధ్యప్రాచ్య వాచ్ అండ్ జ్యువెలరీ ప్రదర్శనలో భాగంగా పలు ఆభరణాల కంపెనీలు తమ ఆసక్తికరమైన ఉత్పత్తు లను ప్రదర్శించాయి. 500మందికి పైగా స్థానిక, అంతర్జాతీయ ప్రదర్శనకారులు పాల్గొనగా, ప్రపంచవ్యాప్తంగా 1800 మంది డిజైనర్లు, వర్తకులు వారి ఉత్పత్తులు ప్రదర్శించారు. వీటిలో దుబాయ్ డ్రస్‌తో పాటు మూడున్నర కోట్ల రూపాయల విలువైన గోల్డ్ ప్లేటెడ్ సైకిల్ కూడా ఉండడం చెప్పుకోదగిన విశేషం!



విినూత్నం

ప్రతి ఒక్కరిలో రహస్య నైపుణ్యాలు దాగి ఉంటాయి. వాటిని కనిపెట్టి మెరుగులు దిద్ది, ప్రతిభను చాటుకునే సామర్థ్యం కొందరికే ఉంటుంది. కేరళకు చెందిన బీట్ ఆఫీసర్, బిస్మి విల్స్ కథే ఇందుకు ఉదాహరణ. అటవీ శాఖలో వృత్తి బాధ్యతలకే పరిమితమైపోకుండా, తనలోని కెమెరా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని, కేరళ అటవీ శాఖ ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ ప్రయత్నాలకు నిదర్శనంగా మారిందామె. మరిన్ని వివరాలు...

అడవిలో ఫొటోగ్రాఫర్‌గా మారి..

తిరువనంతపురంలోని పరసాలకు చెందిన బిస్మి విల్స్. కేరళ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా ఎంపికైంది. పరీక్ష పాసై, ఉద్యోగానికి ఎంపికైంది కాబట్టి వృత్తిలో చేరాలనే ఆలోచనే తప్ప, వృత్తి పట్ల ఆమెకెలాంటి ఆసక్తి కలగలేదు. అయితే ఆమె పై అధికారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రియ టి.జోసెఫ్ మాటలు బిస్మిని ప్రభావితం చేశాయి. వృత్తిలో పైకి ఎదగాలంటే, వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండాలనీ, మక్కువ పెంచుకోవాలనీ ప్రియ... బిస్మికి హితబోధ చేసింది. ఆ మాటలు బిస్మి మనసులో నాటుకుపోయాయి. అప్పటి నుంచి అడవిలో గస్తీ సమయంలో పరిసరాలను ఆసక్తిగా గమనించడం మొదలుపెట్టింది.

చుట్టూరా అందమైన ప్రకృతి, ఆసక్తి కలిగించే వన్యప్రాణులు, వాటి ప్రవర్తనలు ఆమెను ఆకట్టుకోవడం మొదలుపెట్టాయి. వాటిని జ్ఞాపకాల్లో బంధించడంతో పాటు, అటవీ శాఖకు ఉపయోగపడేలా కెమెరాలో బంధిస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే ఆలోచనతో ఒకడిఎస్ఎల్ఆర్ కెమెరా కొనుగోలు చేసింది బిస్మి. ఈ సందర్భం గురించి ప్రస్తావిస్తూ....'పంప ప్రాంతంలో విధులు నిర్వహించే సమయంలో అక్కడి చెట్ల ఆకులు నన్ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఫీల్డ్ డ్యూటీలో భాగం వేర్వేరు చెట్లను గుర్తు పెట్టుకోవడం కోసం వాటి ఆకులను



సేకరించడం మొదలుపెట్టాను. ఆ తర్వాత నా ఆసక్తి సీతాకోకచిలుకల మీదకు మళ్లింది. వేర్వేరు జాతుల డేటాను సేకరించడం కోసం ఒక యాప్‌ను కూడా ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకున్నాను. అయితే చిన్న జాతుల మధ్య తేడాలను గుర్తించాలంటే వాటిని ఫొటోలు తీసుకోక తప్పదు. దాంతో నాది పాత ఫోన్ అవడంతో, ఒక డిజిటల్ కెమెరా కొనుక్కున్నాను" అంటూ తన కెమెరా ప్రయాణం తొలినాళ్ల గురించి వివరించింది బిస్మి.

నేర్పు, ఓర్పు అవసరం

పంప నుంచి వలక్కడువుకు బదిలీ అవడంతో బిస్మిలోని వన్యప్రాణుల ప్రేమికురాలు మేలుకొంది. "పంపకు భిన్నంగా వలక్కడువులో ఏనుగులు, సాంబార్ డీర్.. ఇతర జంతువులు కనిపిస్తూ ఉండేవి. ఫారెస్ట్ వాచర్, అనుభవమున్న వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ విష్ణు నాకు తోడయ్యాడు. దాంతో ఇద్దరం కలిసి వన్యప్రాణులను వెతుక్కుంటూ కొండల మీద తిరగడం మొదలుపెట్టాం. ఏనుగుల వాసనను పసిగట్టి, వాటికి 250 మీటర్ల దూరానికి చేరుకుని, అందమైన ఫొటోలు తీయడం మొదలుపెట్టాం. జంతువుల దృష్టిలో పడకుండా ఎలా నడుచుకోవాలో, వాటికి భంగం కలగకుండా ఫొటోలు ఎలా తీయాలో, గాలి వీచే దిశ ఆధారంగా, నా ఉనికిని జంతువులు పసిగట్టే వీలు లేకుండా ఫొటోలకు తగిన ప్రదేశాన్ని ఎలా ఎంచుకోవాలో అతను నాకు నేర్పించాడు.

ఆ మెలకువల మీద పట్టు పెరిగిన తర్వాత, ఎన్నో మరపురాని ఫొటోలను తీయగలిగాను. ఎలుగుబంటి మీద దాడి చేసే అడవి కుక్కను ఫొటోలో బంధించగలిగాను. మేత మేస్తూ, గొడవ పడుతూ, ప్రేమ ప్రదర్శించుకునే పాతిక ఏనుగుల మందను ఫొటోలు తీయగలిగాను. అయితే ఫొటోల కోసం నేను చేసే ప్రతి ప్రయత్నం ఫలిస్తుందనే నమ్మకం ఉండదు. గంపెడు ఆశతో వెళ్లి, నిరుత్సాహంతో వెనుతిరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. గంటల తరబడి ఎదురుచూసి, ఖాళీ చేతులతో తిరిగొచ్చిన రోజులూ లేకపోలేదు. వన్యప్రాణుల ఫొటోగ్రఫీకి ఎంతో నేర్పు, ఓర్పు అవసరం" అంటూ ఫొటోలు తీయడంలో ఎదుర్కొన్న శ్రమల గురించి వివరిస్తోంది బిస్మి.

పులిని ఫొటో తీయాలి

"నా అంతిమ లక్ష్యం పులిని ఫొటోలు తీయడం. చాలాసార్లు వాటిని అనుసరించినా, కెమెరాలో బంధించే అవకాశం ఇప్పటివరకూ రాలేదు. పులులు సిగ్గరులు. అవి మనుషులకు దూరంగా ఉంటాయి. అయినా ఏదో ఒకనాటికి పులిని కచ్చితంగా కెమెరాలో బంధిస్తాను' అంటున్న బిస్మి, ప్రకృతి, వన్యప్రాణుల పట్ల ప్రేమతో అటవీ శాఖలో చేరుతున్న మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందనీ, అయితే ఈ వృత్తిలోకి అడుగుపెట్టే ప్రతి ఒక్కరూ అడవులు, వన్యప్రాణుల పట్ల మక్కువను పెంచుకోవడం అవసరమని అంటోంది. ఆమె తీసిన ఫొటోలు కేరళ అటవీ శాఖ డాటా సేకరణకు ఎంతో బాగా ఉపయోగపడుతున్నాయి. బిస్మి ఫొటోల వల్ల, అడవిలో వన్యప్రాణుల జీవనశైలి, వాటి మధ్య వైవిధ్యాలను ఆధారాలతో సహా ప్రదర్శించగలిగే అవకాశం కూడా దక్కుతూ ఉండడం చెప్పుకోదగిన విశేషం .



ఈ మహిళా కారాగారం... బతుకుల్ని మార్చే ఆశ్రమం

వివిధ కారణాలతో ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న వారి జీవితాల్లో మార్పు కోసం, సాధికారత కోసం కృషి చేస్తోంది రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం.
ఈ సెమీ ఓపెన్ ప్రిజన్‌లో, ఆశ్రమంలాంటి వాతావరణంలో మహిళా ఖైదీలు... పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు.
కూరగాయల పెంపకం, పిండి వంటల తయారీ... ఇలా ఎన్నో మార్గాలతో జైలుకు ఆదాయాన్ని సమకూరుస్తూ, వేతనాలు సంపాదిస్తున్నారు.
జైలు నుంచి విడుదలయ్యాక సొంతకాళ్ల మీద నిలబడి, స్వయంసమృద్ధి సాధించడానికి పునాదులు వేసుకుంటున్నారు.



కృషితో నాస్తి దుర్భిక్షం... ఇది పెద్దలు చెప్పిన మంచి మాట. కృషితో మంచి మార్పు కూడా సాధ్యమేనని రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం అధికారులు రుజువు చేస్తున్నారు. మహిళా ఖైదీలకు చదువుతోపాటు పంటల సాగు, వంటల తయారీలో నైపుణ్యాలను అందించి, జైలు నుంచి వారు విడుదలయ్యాక.. సొంత కాళ్ల మీద నిలబడేందుకు ఊతం ఇస్తున్నారు. దేశంలోని కొన్ని మహిళా కారాగారాల్లో ఓపెన్ ప్రిజన్ విధానం ప్రారంభమైనా, రకరకాల సమస్యలతో కొంత కాలానికే మూతపడ్డాయి. కానీ ఇక్కడ ఏడాదిన్నర నుంచి విజయవంతంగా అమలవుతోంది. ఆ జైలులోని మహిళా ఖైదీలు ఎన్నో రకాల పంటలు పండిస్తూ జైలుకు ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు వేతనాల రూపంలో తామూ సంపాదించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప, రాజమహేంద్రవరంలో మాత్రమే ప్రత్యేక మహిళా కారాగారాలు ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని కారాగారాన్ని ఆశ్రమం మాదిరిగా తీర్చిదిద్దారు. మహిళా ఖైదీల జీవన స్థితిగతులను మెరుగుపరచడం కోసం, శిక్ష పూర్తయ్యాక తక్కువ పెట్టుబడితో వ్యాపారం చేసుకొని జీవనోపాధి పొందడం కోసం వారికి ఆసక్తి ఉన్న పనిలో తర్ఫీదు ఇస్తున్నారు. వారి నైపుణ్యాలను పదునుపెడుతున్నారు.

పూర్తి సేంద్రియంగా...

ఈ కారాగారంలో సెమీ ఓపెన్ ప్రిజన్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.. సాధారణంగా శిక్షపడిన, రిమాండ్ ఖైదీలను జైలు లోపల ఉంచుతారు. వాళ్లలో సత్ప్రవర్తనతో మెలిగే జీవిత ఖైదీలను జైలు ప్రాంగణంలో వివిధ అవసరాలకు వినియోగిస్తారు. ఇక్కడి ఓపెన్ ప్రిజన్ కోసం 27 మంది ఖైదీలను ఎంపిక చేశారు. వారిలో కొందరు విడుదల కాగా... ప్రస్తుతం 15 మంది ఉన్నారు. వీళ్లను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. ఈ జైలుకు చెందిన అయిదు ఎకరాల భూమి పూర్వం చిట్టడవి మాదిరిగా ఉండేది. దాన్ని సాగుకు అనువుగా మలిచారు. సుమారు రూ.1.50 లక్షలతో డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ భూమిలో అంజూర, షర్బత్ నిమ్మ, ఉసిరి, సీతాఫలం, వాటర్ యాపిల్, నారింజ, బత్తాయి, మామిడి, పనస, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, జామ తదితర పండ్ల మొక్కలను నాటారు. వంకాయ, బెండ, దోస, ఆనప, కాకర, గోరు చిక్కుడు, పందిరి చిక్కుడు, బీర, టమాట, దొండ లాంటి కూరగాయలతో పాటు ఆకు కూరలను జైలు సిబ్బంది పర్యవేక్షణలో మహిళా ఖైదీలు సాగు చేస్తున్నారు. వీరికి గతంలో ఎలాంటి వ్యవసాయ అనుభవం లేదు. ఉద్యానవన, అటవీ, వ్యవసాయ తదితర శాఖల సలహాలను పాటిస్తూ పూర్తి ప్రకృతి, సేంద్రీయ పద్ధతిలో పంటలను పండిస్తున్నారు. ట్రాక్టరు లాంటి యంత్రాలు లేకుండా సంప్రదాయ విధానాలను అనుసరిస్తూ.. రోజుకు రూ.1500 వరకూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.



త్వరలో క్యాటరింగ్ సేవలు...

రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారంలో కవర్ల తయారీ యూనిట్, బేకరీ యూనిట్, టైలరింగ్ యూనిట్ ఉన్నాయి. వీటిలో తయారు చేసే పదార్థాలు, వస్త్రాలు, వస్తువులను జైలు బయట విక్రయిస్తారు. అలాగే రాగి మాల్ట్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి జైలు బయట చేసే ఆకు కూరలు, కాయగూరల విక్రయాలు అరగంటలో పూర్తయిపోతాయి. బేకరీ యూనిట్‌లో నాణ్యమైన దినుసులు ఉపయోగించి... స్వీట్లు చాక్లెట్లు, ఉస్మానియా బిస్కట్లు, ఫ్రూట్‌కేక్, బ్రెడ్, వాము పకోడీ, కారప్పూస, జంతికలు, అటుకుల మిక్చర్, కార్న్ ఫ్లాక్స్, బూందీ, బెల్లం గవ్వలు లాంటివి తయారు చేసి బహిరంగ మార్కెట్ కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. ఇవి నిల్వ ఉండడానికి, రుచి పెంచడానికి ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. పిండి వంటలు, బేకరీ ఐటమ్స్, టైలరింగ్, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రోజుకు రూ.5వేల వరకూ జైలుకు ఆదాయం సమకూరుతోంది. "ఇప్పటికే ఆర్డర్లపై పిండి వంటలు తయారుచేసి ఇస్తున్నాం. త్వరలో క్యాటరింగ్ సేవలు, స్వీట్ స్టాల్ కూడా ప్రారంభిస్తాం. ఈ ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత బతుకుతెరువుకు ఇబ్బంది పడకుండా సమాజంలో గౌరవంగా జీవించాలనేదే మా ధ్యేయం. దీని వెనుక మా డీజీ, ఐజీ, డీఐజీల ప్రోత్సాహం చాలా ఉంది. మహిళా ఖైదీలతో వ్యవసాయం దిశగా అడుగులు వేయడంలో డీజీ హరీశ్ కుమార్ గుప్తా ఎంతో సహకరించారు. మా సిబ్బంది సహాయంతో మహిళా ఖైదీల జీవితాల్లో మెరుగైన మార్పులు రావడానికి కృషి చేస్తున్నాం" అంటున్నారు జైలు సూపరింటెండెంట్ వసంతకుమారి.



తారతమ్యాలు లేకుండా...

రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారంలో తారతమ్యాలకు తావు ఉండదు. ఏ పండుగ వచ్చినా అందరూ కలసిమెలసి చేసుకుంటారు. జైలు అధికారులు, సిబ్బంది కూడా భాగస్వాములవుతారు. ఎవరి ప్రార్థనాలయాలు వారికి ఉన్నాయి. రోజూ ఉదయం యోగాతో ఖైదీలు తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. తర్వాత కాసేపు ఇష్ట దైవారాధన చేసి, దైనందిన పనుల్లో నిమగ్నమవుతారు. వంటశాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుతారు. జైలు ఆవరణలో ఎటు చూసినా పచ్చదనం, అందమైన రంగవల్లులు కనువిందు చేస్తాయి. ఈ ప్రాంగణంలో ఆరు పడకల ఆసుపత్రి ఉంది. వైద్యులు నిరంతరాయంగా అందుబాటులో ఉంటారు. డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సులు చదివే సౌలభ్యం ఉంది. అధికారుల ప్రోత్సాహంతో 2008 నుంచీ ఇప్పటి వరకూ 32 మంది డిగ్రీ, ఇద్దరు పీజీ పూర్తి చేశారు. 2021-2024లో డిగ్రీ పూర్తి చేసిన డి.నాగరాజకుమారి బంగారు పతకం సాధించారు. ఈ కారాగారంలో అయిదు వేల పుస్తకాల గ్రంథాలయం కూడా ఉంది.

• పి.రమేశ్ నాగేంద్ర

వంటింటి వ్యర్థాలే బలం..!

మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి ఎరువులు అత్యవసరం. రసాయన ఎరువులకు బదులు వంటింటి వ్యర్థాలను ఉపయోగిస్తే మొక్కలు మరింత ఆరోగ్యంగా ఉంటాయి. వంటింటి వ్యర్థాలను సేంద్రీయ ఎరువులుగా ఎలా వాడాలో తెలుసుకుందాం...

- కోడిగుడ్డు పెంకుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది మొక్క పెరుగుదలకు తోడ్పడడమే కాకుండా పూలు, కాయలు అధికంగా ఉత్పత్తి కావడానికి దోహదం చేస్తుంది. కోడిగుడ్డు పెంకులను మెత్తగా పొడి చేయాలి. మొక్కల మొదళ్లలో కొద్దిగా



తవ్వి, వేర్ల చుట్టూ ఈ పొడిని చల్లాలి. తరువాత యథావిధిగా మట్టిని పరచి కొన్ని నీళ్లు చిలకరించాలి. గుడ్డు పెంకుల పొడిని నీళ్లలో కలిపి రోజూ మొక్కల మొదళ్లలో పోసినా ప్రయోజనం కనిపిస్తుంది.
- అరటి పండు తొక్కలో అధికంగా ఉండే పొటాషియం, భాస్వరం లాంటి మూలకాలు.. పూల ఉత్పత్తిని పెంచుతాయి. అరటి తొక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసి ఒక ప్లాస్టిక్ బాటిల్‌లో వేయాలి.



నిండా నీళ్లు పోసి మూతపెట్టి మూడు రోజులు అలాగే ఉంచాలి. తరువాత ఈ నీటిని మొక్కల మొదళ్లలో పోస్తే పువ్వులు గుత్తులు గుత్తులుగా వస్తాయి.
- ఆకు కూరల కాడలు, కూరగాయల వ్యర్థాలు.. సహజ ఎరువులుగా పనిచేస్తాయి. వీటిని మట్టిలో కలిపి మొక్కల మొదళ్లలో చల్లవచ్చు. లేదంటే మొక్కల మొదళ్లలో, చుట్టూరా కొద్దిగా తవ్వి వీటిని వేసి పైన మట్టితో కప్పవచ్చు.
- వాడేసిన టీ పొడిలో కొన్ని నీళ్లు పోసి వడకట్టాలి. ఈ పొడిని గట్టిగా పిండి కాగితం మీద వేసి బాగా ఆరబెట్టాలి. తరువాత ఈ పొడిని వారానికి ఒకసారి కొద్దికొద్దిగా తీసుకుంటూ మొక్కల మొదళ్లలో చల్లాలి. ఇలా చేయడం వల్ల పచ్చని ఆకులతో మొక్కలు ఏపుగా పెరుగుతాయి.



పిల్లల విషయంలో జాగ్రత్త..!

నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలపై రకరకాల ఆశలు పెట్టుకుంటున్నారు. వాటిని సాధించి తీరాలంటూ పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. దీని వల్ల పిల్లల మానసిక స్థితి ప్రభావితమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలను పెంచే క్రమంలో తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...



- పిల్లలందరి శక్తి సామర్థ్యాలు, ఆలోచన తీరు ఒకేరకంగా ఉండవు. కాబట్టి పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. అవసరమైన శిక్షణ ఇప్పించాలి.
- క్రమశిక్షణ పేరుతో పిల్లలకు కఠినమైన ఆంక్షలు పెట్టకూడదు. కేవలం చదువుకు మాత్రమే ప్రాముఖ్యమిస్తే పిల్లలు ఆటపాటల్లో రాణించలేరు. అంతేకాదు వాళ్లకు.. ఇతరులతో మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, పోటీ తత్వం అలవడవు.
- పిల్లలు ఏవైనా పొరబాట్లు చేస్తే వారిపై కోపం చూపించకూడదు. సామరస్యంగా వ్యవహరించి మంచి, చెడుల తారతమ్యాన్ని వివరించాలి.
- పరీక్షల్లో మార్కులు తగ్గాయనో, ఆటల్లో ఓడిపోయారనో పిల్లలను 'నీకేమీ చేతకాదు' అంటూ నిరాశ పరచకూడదు. దీనివల్ల పిల్లల ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. మరో ప్రయత్నం చేసి అనుకున్నది సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలి.
- పిల్లల ఇష్టాలు, ఆశయాలు తెలుసుకోకుండా చెప్పిన మాట వినాలంటూ ఒత్తిడి చేయకూడదు. పిల్లలు ఏవిధంగా ఆలోచిస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. పిల్లల అభిరుచులను గమనిస్తూ ఉండాలి. సమయం దొరికినప్పుడల్లా పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి.
- పిల్లల మీద అతిగా ప్రేమ చూపిస్తూ వాళ్లు ఏమి చేసినా సమర్థించడం కూడా మంచిది కాదు. పిల్లలకు సమయపాలన, తోటివారితో స్నేహంగా ఉండడం, పెద్దలతో మర్యాదగా మెలగడం, సమయస్ఫూర్తి నేర్పించాలి. పోషకాహారం, వ్యాయామం, వ్యక్తిగత శుభ్రతల గురించి తెలియజెప్పాలి.

కూటమి హయాంలోనే ఉద్యోగులకు స్వేచ్ఛ

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. త్వరలో ఆర్టీసీ, మిగిలిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి సంకల్పంతో ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలడం మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులు పూర్తి స్వేచ్ఛగా పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రం పూర్తిగా లోటు బడ్జెట్‌లో ఉన్నా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని చెప్పారు. నవంబరు 1 నుంచి ఒక డీఏ ఇస్తున్నట్లు సీఎం ప్రకటించి ఉద్యోగ సంఘాల నాయకులు విధులకు ఆటంకం లేకుండా చూస్తున్నారని చెప్పారు.

యువకుడికి గాయాలు

యడ్లపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పండుగ వేళ యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలో విషాదం నెలకొంది. బాణసంచా కాలుస్తూ ప్రమాదవశాత్తు ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన 24 ఏళ్ళ పి. సాయికిరణ్ తిమ్మాపురం గ్రామ పరిధిలోని ఓ నూలుపరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. గ్రామంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ రోజూ విధులకు వెళుతుంటాడు. దీపావళి పండుగ సందర్భంగా సోమవారం ఇంటి ముందు బాణసంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు బేసిన్‌లో ఉంచిన టపాసులపై పడ్డాయి. అవి ఒక్కసారిగా పేలడంతో సాయికిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది అతనికి ప్రథమ చికిత్స అందించి అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సాయికిరణ్‌తో పాటు ఓ యువతికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు పేలుడు జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

కొండవీడు అభివృద్ధిపై సీఎంకు నివేదిక



కొండవీడు అభివృద్ధిపై నివేదికను సీఎంకు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రూ.100 కోట్ల అంచనా వ్యయంతో కొండవీడు అభివృద్ధిపై రూపొందించిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కలిసి అందజేశారు. చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కొండవీడు కోట అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి సీఎంకు విజ్ఞప్తి చేశారు. కొండవీటి కోటను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి ఎనలేని మేలు కలుగుతుందని, టెంపుల్ టూరిజానికి మంచి కేంద్రబిందువు కాగలదని చెప్పారు. గతంలో కొండవీడు కోట అభివృద్ధిపై కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి తెలియజేసిన అంశాలను సీఎంకు ప్రత్తిపాటి వివరించారు. పర్యాటకాభివృద్ధి కోసం కేంద్రం చేపట్టిన ఎస్ఏఎస్‌సీఐ, స్వదేశీ దర్శన్ పథకాల్లో కొండవీడు ప్రాజెక్టును చేర్చడంలో ప్రత్యేక చొరవ చూపాలని ముఖ్యమంత్రిని ప్రత్తిపాటి విన్నవించారు. అలాగే చిలకలూరిపేట నియోజకవర్గ సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని ఈ సందర్భంగా సీఎంను ప్రత్తిపాటి కోరారు. ముఖ్యంగా రైతాంగానికి మేలు చేసే ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపునకు సరిపడా నిధులు కేటాయించి, నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం పెంపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కంపెనీల హామీతో గతేడాది నియోజకవర్గ రైతాంగం విరివిగా పొగాకు సాగు చేసిందని, ప్రభుత్వం చేపట్టిన కొనుగోళ్ల ప్రక్రియ వల్ల అందరికీ న్యాయం జరగలేదని పేర్కొన్నారు. సమస్యను పరిశీలించి చిలకలూరిపేట సహా పొగాకు సాగుచేసిన రైతాంగానికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని ప్రత్తిపాటి కోరారు.

దీపావళి వేడుకల్లో నారా భువనేశ్వరి

తాడేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలోని చిగురు చిల్డ్రన్స్ హోమ్‌లో అనాథ పిల్లలతో కలసి సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం రాత్రి దీపావళి వేడకల్లో పాల్గొన్నారు. అక్కడ



ఉన్న పిల్లలకు టపాసులు, స్వీట్లు పంచడమే కాక వారితో కలిసి టపాసులు కాల్చి వారికి స్వయంగా భోజనం వడ్డించారు. పిల్లలతో ముచ్చటించి వారి బాగోగులు తెలుసుకున్నారు. 90 మంది ఉండే ఆ చిల్డ్రన్స్ హోమ్‌లో దాదాపు గంట సమయంపాటు నారా భువనేశ్వరి పిల్లలతో గడిపి వారితో ఫోటోలు దిగి పిల్లలను ఆశీర్వదించారు.



పిల్లలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న భువనేశ్వరి

మెడికల్ కళాశాలలపై వైసీపీ దుష్ప్రచారం



● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలు నిర్మించి పేదలకు అత్యాధునిక వైద్యసేవలను తీసుకురావడం మాజీ సీఎం జగన్‌కు ఏమాత్రం ఇష్టం లేనట్లు ఉందని గురజాల ఎమ్మెల్యే, శాసనసభ సదుపాయాల కమిటీ సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పేదలకు అత్యాధునిక వైద్యసేవలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తుంటే వైసీపీ బురదజల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పీపీపీ విధానంతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 220 అదనపు మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయని, వాటిలో 110 సీట్లు పేద, మధ్యతరగతి పల్నాడు విద్యార్థులకు కేటాయిస్తామని చెప్పారు. జగన్ అనాలోచిత నిర్ణయాలతో మెడికల్ కళాశాలల నిర్మాణానికి పది సంవత్సరాలకు పైగా సమయం పట్టిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం ద్వారా కేవలం రెండేళ్లలో వీటి నిర్మాణాన్ని పూర్తి చేసి 1750 మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో ఉందని చెప్పారు. జగన్ ప్రభుత్వమే ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను ప్రైవేటీకరించిందని, కూటమి ప్రభుత్వం కొత్తగా ఎలాంటి ప్రైవేటీకరణను చేయడం లేదని స్పష్టం చేశారు. పీపీపీ విధానంతో మెడికల్ కళాశాలలు 33 ఏళ్ల తరువాత పూర్తిగా ప్రభుత్వ స్వాధీనంలోకి వస్తాయన్నారు. రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ రావడాన్ని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు అబద్ధపు ప్రచారానికి పూనుకున్నారన్నారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలో ఆర్థిక లావాదేవీలు వ్యక్తిగత కక్షల వల్ల జరిగిన హత్యను వైసీపీ కులాలకు అంటగడుతోందని అన్నారు. వైసీపీ రాజకీయ పార్టీ కాదని, అది ఒక రాక్షస సమూహమని ఎమ్మెల్యే యరపతినేని మండిపడ్డారు.

రేపటి నుంచి బిలియర్డ్స్ టోర్నమెంట్

● పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్లబ్ పాలకవర్గ ప్రతినిధులు బ్రహ్మేశ్వరరావు, యాగంటి దుర్గారావు

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో గురువారం నుంచి ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పురుషుల టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నవంబరు 3వ తేదీ వరకూ ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నమెంట్ కోసం ఎల్‌వీఆర్ క్లబ్‌లోని బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ కాంప్లెక్సులో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు చేశారు. టోర్నమెంట్ పోస్టర్‌లను ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావు, కార్యదర్శి యాగంటి దుర్గారావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ పోటీలను ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరిలో హరియాణాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. బిలియర్డ్స్ విభాగంలో 38 ఎంట్రీలు, స్నూకర్స్ విభాగంలో 215 ఎంట్రీలు రిజిష్టర్ అయ్యాయని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంట్రీలు అత్యధికంగా నమోదవడంతో ఈ టోర్నమెంట్‌కు మరింత ప్రాధాన్యమేర్పడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. 1987లో ఎల్‌వీఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో గుజరాత్‌కు చెందిన గీత్ సేత్ పాల్గొని 147 పాయింట్లు చేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించాడని, ఈ క్లబ్ నిర్వహించిన పోటీల్లో అంతర్జాతీయ క్రీడాకారులు అశోక్ శ్యాండిల్య, పంకజ్ అద్వాని, మనోజ్ కొఠారి, అరవింద్ సవుర్, ఓ.బి.అగర్వాల్ తదితరులు పాల్గొని క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చారని చెప్పారు. ఈ టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శిగా పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్), ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఏల్చూరి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాసరావు, టోర్నమెంట్ నిర్వాహక అధ్యక్షులుగా జి.స్వరాజ్యరావు, ఉపాధ్యక్షులుగా టి.పాండురంగారావు, సంయుక్త కార్యదర్శిగా వి.బాలాజీ సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేశారు. ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ కార్యదర్శి వి.సుశీల్, అధ్యక్షుడు ఇంద్రనీల్ ఈ పోటీలలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సహకారాన్ని అందిస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక



ఎంపికయిన ఉమ్మడి గుంటూరు జిల్లా బాస్కెట్ బాల్ అండర్ 17 జట్టు

చిలకలూరిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ అండర్ 14,17 విభాగాలలో బాలబాలికల జట్ల ఎంపిక చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ మహిళా కార్యదర్శి పద్మావతి, ఏఎంజీ హైస్కూల్ హెచ్ఎం కె.కృపాదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి సుమారు 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా అండర్ 14కు ఎంపికైన క్రీడాకారులు నవంబరు 1వ తేదీ నుంచి 3 వరకు చిత్తూరు జిల్లా మదనపల్లెలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు. అండర్ 17కు ఎంపికైన క్రీడాకారులు కృష్ణాజిల్లా నూజివీడులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

ఆస్తి పంపకాల్లో వివాదం

● అంత్యక్రియలు నిర్వహించేందుకు కొడుకుల నిరాకరణ

యడ్లపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలస గ్రామంలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ఆస్తి పంపకాల విషయంలో వివాదం నెలకొనటంతో కన్నతండ్రి మృతదేహానికి అంత్యక్రియలు చేసేందుకు కుమారులు నిరాకరించారు. గ్రామానికి చెందిన గువ్వల అంజనేయులు (80) అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు నాగేశ్వరరావు కొన్నేళ్ళ కిందట తెలంగాణ వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. అంజనేయులు ప్రస్తుతం తన చిన్న కుమారుడు శ్రీనివాసరావు వద్దనే గ్రామంలో ఉంటున్నారు. అనారోగ్యంతో ఆదివారం ఆయన మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుమారులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు మధ్య ఆస్తి విషయంలో వివాదం మొదలైంది. ఈ క్రమంలో మంగళవారం అంత్యక్రియల కోసం ఏర్పాటు చేసిన పాడెను ఇంటి బయట రోడ్డుపైనే వదిలివేశారు. ఆస్తి విషయం తేలాలంటూ వాదన పెట్టుకున్నారు. గ్రామ పెద్దలు, పోలీసులు నచ్చ చెప్పినా పంపకాల విషయంలో మొండి వైఖరి అవలంబించటం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి గ్రామ పెద్దల చొరవతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

సాగర్‌లో 587 అడుగుల నీటి మట్టం

విజయపురిసౌత్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 587.80 అడుగులు ఉంది. ఇది 305.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,718 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,561 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 52,579 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 52,579 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టెయిల్‌పాండ్‌లో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో మంగళవారం రెండు యూనిట్ల ద్వారా 1.0736 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు.ప్రాజెక్టు 20 క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను 1.50 మీటర్ల మేర ఎత్తి 21,258 క్యూసెక్కులు,టేల్ రేస్ చానల్ ద్వారా 8,595 క్యూసెక్కులు మొత్తంగా 29,853 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు వారు చెప్పారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల జలపాతం, హాలియా వాగుల నుంచి 32,561 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుందని తెలిపారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని వెల్లడించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



కల్యాణ్ చక్రవర్తి (ఫైల్‌ఫొటో)

మాచర్ల రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మాచర్ల పట్టణ శివారులో మంగళవారం రాత్రి జరిగింది. ఏలూరు జిల్లా అనపనేనివారిగూడెంకు చెందిన కొత్తూరు కల్యాణ్ చక్రవర్తి (28) దుర్గిలో ఓ గది అద్దెకు తీసుకొని మాచర్లలోని ఓ ఫర్టిలైజర్స్ షాపులో ఫీల్డ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై టౌన్‌షిప్ నుంచి ప్రధాన రహదారిపైకి రాగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కల్యాణ్ చక్రవర్తిని స్థానికులు మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మాచర్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు మహిళా రైతు మృతి



యడ్ల మాణిక్యమ్మ (ఫైల్‌ఫొటో)

దాచేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పిడుగు పాటుకు గురై దాచేపల్లిలో మంగళవారం ఓ మహిళా రైతు మృతి చెందింది. దాచేపల్లికి చెందిన యడ్ల మాణిక్యమ్మ పత్తిచేలో కలుపు తీస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు రావటంతో వర్షం పడుతుందన్న హడావుడిలో తోటి రైతులు, వ్యవసాయ కూలీలతో కలిసి సమీపంలోని చెట్టు కిందకు చేరింది. ఈలోగా పిడుగు పడటంతో చెట్టు కింద ఉన్న యడ్ల మాణిక్యమ్మ తలకు తీవ్ర గాయమై రక్త స్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కూటమి నేతలు, సీపీఐ నాయకులు మృతురాలికి నివాళులర్పించారు.

బెల్లంకొండలో యువకుడు..



జక్రయ్య (ఫైల్‌ఫొటో)

బెల్లంకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని మన్నె సుల్తాన్‌పాలెం గ్రామంలో పిడుగుపాటుకు గురై ఓ యువకుడు మృతి చెందాడు. మన్నె సుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన మార్బూరు జక్రయ్య (24) పశువులను మేపేందుకు అడవికి వెళ్లాడు. మంగళవారం సాయంత్రం భారీ వర్షంతో పాటు పెద్ద శబ్దంతో పిడుగు జక్రయ్య సమీపంలో పడటంతో గాయాలపాలై జక్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

పొన్నూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఆర్టీసీ బస్సు డిపోలో బస్సు ఢీ కొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. పొన్నూరు ఆర్టీసీ బస్సు డిపోలో కొంతకాలంగా ఓ 70 ఏళ్ల వృద్ధురాలు వేరుశనక్కాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఆమె ఆర్టీసీ డిపో ఎంట్రన్స్ వద్ద ఉండగా డిపోలోకి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దాంతో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో అర్బన్ సీఐ వీరానాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధురాలి మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి శాంథోమ్ కరుణా నిలయం నిర్వాహకుల సహకారంతో తరలించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి..

తుళ్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన దొండపాడు సీడ్ యాక్సెస్ రోడ్డు మీద జరిగింది. పల్నాడు జిల్లా అమరావతి మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన తొరతి గోపి (35) బతుకు తెరువు కోసం కూలీ పనులు చేసుకుంటూ తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామంలో ఉంటున్నాడు. మంగళవారం వడ్డమాను పొలంలో పనిచేస్తున్న వారికి క్యారేజీ ఇవ్వడానికి వెళుతున్న క్రమంలో సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్ వద్ద టిప్పర్ అతడి బైకును ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడకక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం గోపి మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఎల్ఎల్‌బీ పరీక్షా ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన మూడేళ్ల ఎల్ఎల్‌బీ నాలుగు, ఐదు, ఎనిమిది సెమిస్టర్లు, ఐదేళ్ల కోర్సులో నాలుగో సెమిస్టర్‌కు చెందిన పరీక్షా ఫలితాలను మంగళ వారం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. వచ్చే నెల 3వ తేదీ వరకు పున:మూల్యాంకానానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. ఎల్ఎల్‌బీ మూడేళ్ల మొదటి సెమిస్టర్, అలాగే ఐదేళ్ల ఐదో సెమిస్టర్ రీవ్యాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేశామన్నారు.

ఇల్లులేని పేదలందరికీ హౌసింగ్ స్కీమ్ వర్తింప చేయాలి

● కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌ను కోరిన ఎంపీ తెన్నేటి



కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పార్లమెంట్ పరిధిలో విద్యుత్ ప్రాజెక్ట్ ఒకటి ఏర్పాటు చేయాలని, ఇల్లు లేని పేదలందరికి హౌసింగ్ స్కీమ్ వర్తింప చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలు, విద్యుత్ శాఖా మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌ను ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు. దీపావళి పండుగ సందర్భంగా కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ కృష్ణప్రసాద్ పలు విషయాలను ఆయన దగ్గర ప్రస్తావించారు. విద్యుత్ ప్రాజెక్ట్ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పినట్లు ఎంపీ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వస్తే గ్రిడ్ కనెక్టివిటి వచ్చి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగఅవకాశాలు వస్తాయని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

క్రీడలు స్నేహపూర్వకంతో ఉండాలి

● శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ



జవహర్‌బాషాకు ప్రథమ బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ తదితరులు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు క్రీడలు స్నేహభావపూర్వకంగా ఉండటంతోపాటు విజయాన్ని, అపజయాన్ని ఒకేవిధంగా చూసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా సోమవారం వేగేశన ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర స్థాయి స్పీడ్ సైక్లింగ్ పోటీలను ఎమ్మెల్యే నరేంద్రవర్మ, బాపట్ల డీఎస్పీ పి.రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ స్పీడ్ సైక్లింగ్ పోటీలలో విజేతలుగా చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని నదిముల్లాయపాలెం గ్రామానికి చెందిన జవహర్‌బాషాకు ప్రథమ బహుమతి రూ.50,116లు, చెరుకుపల్లికి చెందిన పాలపర్తి దిలీప్‌కుమార్‌కు ద్వితీయ బహుమతి రూ.40,116, ఇంటూరుకు చెందిన ప్రజ్ఞావంశీకి తృతీయ బహుమతి రూ.30,116, గోకరాజుపాలెం గ్రామానికి చెందిన గుంతకల్లు శివసాయిరెడ్డికి నాల్గవ బహుమతి రూ.20,116, పొదిలివారిపాలెం గ్రామానికి చెందిన మంచాల సత్యారెడ్డికి ఐదవ బహుమతి రూ.15,116లు, గోకరాజుపాలెం గ్రామానికి చెందిన ముచ్చు గణేష్‌రెడ్డి 6వ బహుమతి రూ.10,116 గెలుచుకొని విజేతలుగా నిలిచారు. విజేతలకు బాపట్ల రూరల్ సీఐ పి.హరికృష్ణ చేతుల మీదగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ తనయుడు రాకేష్‌వర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, కమిటీ నిర్వాహకులు డేగల శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కనుమూరి సాంబమూర్తిరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, క్రీడాకారులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

స్వాములకు చద్ది ఏర్పాటు

● మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్



అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడా దీక్షాపరులైన స్వాములకు 41 రోజులపాటు చద్ది కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు చద్ది కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి ఏడాది ఈ విధంగా స్వాములకు చద్ది ఏర్పాటు చేయటం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు అన్నం సతీష్ తెలిపారు. మాలాధారణ చేసిన స్వాములంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు ప్రారంభం

బాపట్లరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కాలేజిలో ఐదు రోజుల ఎథికల్ హ్యాకింగ్ వర్క్‌షాపు సైబర్ సెక్యూరిటి విభాగం కార్యక్రమాన్ని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి ప్రారంభించారు. గుంటూరులోని సింథోక్వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈవో రాఘవేంద్ర, సృజన్, అభిలు ఈ వర్క్‌షాపు రీసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించారని తెలిపారు. విద్యార్థులకు ఎథికల్ హ్యాకింగ్ ప్రాథమిక సూత్రాలు, సైబర్ సెక్యూరిటి టెక్నిక్స్, ప్రాక్టికల్ హ్యాండ్స్ ఆన్ సెషన్‌లను అందించారని చెప్పారు. ఈ వర్క్‌షాపు నాలుగు రోజులపాటు కొనసాగి చివరి రోజు 24 గంటల హ్యాకథాన్‌తో ముగింపు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి వి.చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

డీఏ జీవోను వెంటనే సవరించాలి

● ఉపాధ్యాయ సంఘాల వినతి

వేమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పలు ఉపాధ్యాయ సంఘాల పోరాటాల ఫలితంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఇచ్చిన డీఏ జీవోను వెంటనే సవరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ డీఏ జీవో ద్వారా వచ్చే అరియర్స్ ఉద్యోగ విరమణ చేసిన తరువాత చెల్లిస్తామని చెప్పడం పట్ల తీవ్రంగా వ్యతిరేకతను వ్యక్తపరుస్తున్నామన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన ఈ జీవోలలో ఎక్కడా ప్రస్తావించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీవో 60, 61లను వెంటనే సవరణ చేసి ఉద్యోగులకు డీఏ అరియర్స్ వారి పీఎఫ్ ఖాతాలకు సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్స్‌కు వెంటనే సొమ్ము రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసకుమార్, కుందుర్తి శ్రీనివాస్, వేమూరు మండల యూటీఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, పీఆర్‌టీయూ నాయకులు శ్రీరామ్, ఏపీటీఎఫ్ నాయకులు విజయబాబు తమ ప్రకటనల ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

● బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కరువు భత్యం విడుదలపై చేసిన అసంబద్ధ జీవోలు 60, 61లను వెంటనే సవరించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బడుగు శ్రీనివాస్, గుడివాడ అమర్‌నాథ్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పోరాటాల ద్వారా ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి ముఖ్యమంత్రి ద్వారా కరువుభత్యం ప్రకటించటం జరిగిందన్నారు. దీనిపై సర్వీస్ ఉద్యోగులకు విడుదల చేసిన జీవో 60, పెన్షనర్స్‌కి విడుదల చేసిన జీవో 61లలో తెలిపిన అసంబద్ధ అంశాలను వెంటనే సవరించి సరైన ఉత్తర్వులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో ఉద్యమానికి సంసిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి



మహిళ మృతదేహం

కర్లపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని సత్యవతిపేట దగ్గర జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం ఢీకొని సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన మహిళ మృతి చెందిందని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపారు. వీఆర్వో సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని ఎవరైన గుర్తిస్తే ఎస్ఐ రవీంద్ర, సెల్ నెంబరు 9440900870కు సమాచారం అందించాలన్నారు.

అధిక మోతాదులో ఎరువుల వాడకం నియంత్రణకు అవగాహన కల్పించాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



అధికారులతో సమావేశమైన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : అధిక మోతాదులో ఎరువుల వాడకాన్ని నియంత్రించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి భూమాత రక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సరైన అవగాహన లేకపోవటం వల్లే ఎరువులు ఎక్కువగా వాడుతున్నారన్నారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించటానికి, నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి కేంద్రప్రభుత్వం భూమాత రక్షణ కమిటీ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కమిటీలను నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీలు భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వాడకానికి సంబంధించి గ్రామపంచాయతీ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని పెంచేవిధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఏవో అన్నపూర్ణ, గుంటూరు జడ్పీ సీఈవో కృష్ణ, డీఎస్పీ జి.రామాంజనేయులు పాల్గొన్నారు.

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పత్తి కొనుగోలు కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి, ఈక్రాప్ నమోదు, ఈ మత్స్యకార యాప్ నమోదు, ఎరువుల సరఫరా తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 10 మండలాలలో పత్తి సాగు చేశారన్నారు. నవంబరు రెండో వారం నుంచి పత్తి కొనుగోలు చేయటానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎరువుల విక్రయాలకు సంబంధించి ఐఎంఎఫ్ఎస్ యాప్ అప్‌లోడ్ చేయాలని అధికారులకు చెప్పారు. మత్స్యకార యాప్‌లో ఆక్వా పరిశ్రమలను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రాబోయే రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వసతి గృహాల పర్యవేక్షణకు కేటాయించిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా మార్కెటింగ్‌శాఖాధికారి రమేష్, జిల్లా మత్స్యశాఖాధికారి గాలిదేవుడు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు చిత్తశుద్ధితో పనిచేయాలి

కుష్ఠువ్యాధి నిర్మూలనకు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి కుష్ఠువ్యాధి నిర్మూలన కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు వైద్య, ఆరోగ్యశాఖాధికారులు ఇంటింటికి వెళ్ళి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నవంబరు 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కుష్ఠువ్యాధి నిర్మూలనపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఆశావర్కర్లు సచివాలయాల స్థాయిలో ఇంటింటికెళ్ళి పరీక్షలు చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులకు అవసరమైన చికిత్సలు నిర్వహించటానికి ఏరియా వైద్యశాలలో అవసరమైన పరికరాలు సమకూర్చుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబి కంట్రోల్ అధికారి సోముల నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, జీఎస్‌డబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వకమైన వాతావరణంలో బీచ్‌లు ఉండాలి

పర్యాటకులకు స్నేహపూర్వకమైన వాతావరణంలో బీచ్‌లు ఉండేలా అభివృద్ధి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగం చాలా కీలకమైనదిగా ఉందన్నారు. సముద్రతీర ప్రాంతాలైన 17 గ్రామపంచాయతీలలో బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. 8 పంచాయతీ పరిధిలో 9 బీచ్‌లలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధించాలని ఆదేశించారు. బీచ్‌లను అపరిశుభ్రం చేస్తే జరిమానాలు విధించాలన్నారు. దుకాణాలకు, వాహనాల పార్కింగ్ ధరలు నిర్ణయిస్తూ పంచాయతీలలో తీర్మానం చేయాలన్నారు. దీని ద్వారా వచ్చే డబ్బులను పరిశుభ్రతకు వినియోగించాలన్నారు. బీచ్ రహదారిలో అధికంగా చెత్తకుండీలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులు సందర్శించే ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటే ఉపేక్షించేదిలేదని వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. సమావేశంలో డీపీవో ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు, డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్‌లో ప్రజలతో కలిసి భోజనం చేస్తూ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అన్న క్యాంటీన్‌లో రుచికరమైన భోజనం అందించాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అన్నక్యాంటీన్‌లో ప్రజలకు రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సూర్యలంక రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నక్యాంటీన్‌లో ప్రభుత్వం రూ.5కే భోజనం ఏర్పాటు చేసిందన్నారు. రూ.5 చెల్లించి టోకెన్ తీసుకొని ప్రజలతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. భవన నిర్మాణ కార్మికులతో కలిసి కలెక్టర్ భోజనం చేస్తూ సౌకర్యాలు గురించి వారితో మాట్లాడి తెలుసుకున్నారు. వసతులు బాగున్నాయని ప్రజలు తెలిపారు. ఎక్కువ సంఖ్యలో అన్నక్యాంటీన్‌కు భోజనం కోసం వచ్చే వారికి క్యాంటీన్ వెనుక వైపు షెడ్ ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతరం కొనసాగాలి

యువతలో నైపుణ్యాభివృద్ధి కొరకు ప్రత్యేక శిక్షణలు బాపట్లలో నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. రాష్ట్రప్రభుత్వం లక్ష్యం మేరకు నాణ్యతా ప్రమాణాలతో శిక్షణలు నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరంతరం జిల్లాలో 720 మందికి శిక్షణ ఇవ్వాలన్నారు. డీఆర్‌డీఏ అనుబంధంగా సి డాప్ శిక్షణలు యువతకిచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ కార్యక్రమం సమర్థంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజారావు, డీఆర్‌డీఏ పీడీ లవన్న, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి

ప్రధానమంత్రి ఆదర్శయోజన కింద గుర్తించిన గ్రామాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అమలౌతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎస్సీలు అధికంగా ఉన్న గ్రామాలలో మౌలికసదుపాయాల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈమేరకు 18 మండలాలలో 59 గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఒక్కొక్క గ్రామానికి రూ.20 లక్షల నిధులు కేటాయించిందన్నారు. అభివృద్ధి పనులపై ఎంపీడీవోలు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నిధులను జాగ్రత్తగా వినియోగించాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శయోజన కింద మంజూరు చేసిన పనులను పది రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన స్వామిత్వ సర్వేను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మొక్కలను విస్తారంగా నాటాలని, ప్రతి ఇంటి ముందు, దుకాణాల ముందు మొక్కలు ఉండాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంత రాజు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

కొల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘ నాయకులు దహనం చేశారు. ట్రంప్ విధిస్తున్న సుంకాలను వ్యతిరేకిస్తూ కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేసిన అనంతరం సంఘ జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకట్రామయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై నిర్లక్ష్యం వీడాలన్నారు. టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు తదితర ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.నాగమల్లేశ్వరరావు, బి.సుబ్బారావు, వి.రమేష్ పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి ఆలయాన్ని సందర్శించిన ప్రముఖులు



ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సత్యనారాయణకు శ్రీ బగళాముఖి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో జి.నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో న్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన 81వ అమావాస హోమ కార్యక్రమాలలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీబగళాముఖి అమ్మవారు మహాకాళీ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఐఏఎస్‌కు చెందిన బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సత్యనారాయణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఐపీఎస్‌కు చెందిన శ్రీలక్ష్మీనారాయణ రాహుకాలంలో జరిగే విశిష్ట హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమాలను త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల పాలకమండలి అధ్యక్షుడు కలకోట చక్రధర్‌రెడ్డి సంయుక్తంగా పర్యవేక్షించారు.

బాపట్లలో దీపావళి సందడి



క్రాకర్స్ కాలుస్తున్న నరేంద్రవర్మ, ఆయన తనయుడు రాకేష్‌వర్మ

బాపట్ల, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. అధికారులు,నాయకులు, ప్రజలు కుటుంబ సమేతంగా బాణాసంచా కాలుస్తూ సంతోషంగా, సరదాగా గడిపారు. కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ కుటుంబ సమేతంగా బాణా సంచా కాల్చారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆయన తనయుడు రాకేష్‌వర్మతో కలిసి బాణా సంచా కాలుస్తూ వేడుకను జరిపారు. మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో బాణా సంచా విక్రయదుకాణాలు ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. పండుగ ముందురోజు భారీవర్షం కురిసినప్పటికి పండుగరోజు వరుణుడు శాంతించటంతో దుకాణాలలోని బాణా సంచా విక్రయాలు సక్రమంగా జరిగాయి.

రేపల్లెలో...



టపాసులు పేలుస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో దీపావళి సందర్భంగా వారి గృహాల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి కుటుంబ సభ్యులంతా కలిసి టపాసులు పేలుస్తూ ఘనంగా దీపావళి పండుగను నిర్వహించారు. పాత పట్నంలోని అంకమ్మ చెట్టు వద్ద పండుగను పురస్కరించుకుని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి గుడిచుట్టూ దీపాలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి టపాసులు పేల్చారు. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇంటి వద్ద పండుగను పురస్కరించుకుని సోదరుడు శివప్రసాద్, కుమారుడు రానా టపాసులు పేల్చారు.

సుంకాలను వెంటనే విరమించుకోవాలి : వ్యకాస

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు మంగళవారం రాత్రి పట్టణంలో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండయ్య మాట్లాడుతూ అమెరికాలో ఉన్న భారతదేశ ప్రజలపై అనేక రకాల వీసా ఆంక్షలు విధించటం అక్కడ ఉన్న వారికి ఆందోళన కలిగిస్తున్నదన్నారు. వీటిపై ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించాలన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి కె.శరత్, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.సుభాషిణి, నాయకులు నాగేశ్వరరావు, లక్ష్మణ్, రవికిరణ్, వలి, అనూష పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసంలో సూర్యలంక సముద్రతీరానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం కార్తీకమాస ఏర్పాట్లుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యాటకుల భద్రతకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గస్తీ నిర్వహించాలన్నారు. గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు దుస్తులు మార్చుకునే ఏర్పాట్లు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇంకా ఆయా శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా, మార్కెట్ యార్డు కమిటి ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం

● పూజలకు సిద్ధమైన శివాలయాలు



కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా పూజకు సిద్ధమైన చెన్నమల్లేశ్వరస్వామి

రేపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం బుధవారం నుంచే ప్రారంభంకానున్న సందర్భంగా నియోజకవర్గంలోని శివాలయాలన్నీ పూజలకు సిద్ధమయ్యాయి. ఆయా ఆలయ కమిటీలు దేవదాయ, ధర్మాదాయశాఖాధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులు దీపారాధన, ప్రదక్షణలు, పూజలు నిర్వహించేందుకు అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ శాఖ ఈవో దివి అప్పలాచార్యులు సిద్ధం చేయించారు. అదేవిధంగా పట్టణంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయం, పాతపట్నంలోని శివాలయం, అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయం, మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయం, చోడాయపాలెం చౌడేశ్వరస్వామి, గోకర్ణమఠం గోకర్ణేశ్వరస్వామి దేవాలయాల్లో పూజలకు సిద్ధం చేశారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల కోసం ఆలయాలు తెరిచి ఉంటాయి. పెనుమూడి కృష్ణానది వద్ద, మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తులు పుణ్యస్నానాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

లస్కర్‌ల జీతాలను అందించాలి



మురళీధరరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న లస్కర్లు

రేపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న లస్కర్ల జీతాలను ఇప్పించాలని కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటి ఛైర్మన్ పంతాని మురళీధరరావుకు మంగళవారం లస్కర్లు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా లస్కర్లు మాట్లాడుతూ కేడబ్ల్యూ సబ్ డివిజన్ పరిధిలోని తెనాలి, రేపల్లె, బాపట్ల, చీరాల, దుగ్గిరాలలో గల కాల్వలపై 110 మంది తాత్కాలిక లస్కర్లుగా పది సంవత్సరాల నుంచి పని చేస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా లేదా పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. 12 నెలలుగా జీతాలు లేవని, కుటుంబపోషణకు ఇబ్బందిపడుతున్నామని తమ సమస్యను రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌దృష్టికి తీసుకుని వెళ్ళి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు మాట్లాడుతూ కాల్వలపై విధులు నిర్వహిస్తున్న 110 మంది లస్కర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని లస్కర్లు పాల్గొన్నారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన

అమృతలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవాడలో ప్రసిద్ధి చెందిన బాల కోటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పార్వతీ అమ్మవారికి కోటి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచారక్ జన్మదినంలో జరిగిన కార్యక్రమంలో సామూహిక కోటి కుంకుమార్చనతో పాటు లలితా సహస్రనామ పారాయణ, సామూహిక లలితా సహస్రనామ పూజలు, శాంతి హోమం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీనివాసవర్మ నిర్వహణలో ప్రధాన అర్చకులు స్వర్ణ శ్రీనివాస్ శర్మ శైవాగమ శాస్త్ర ప్రకారం లోకహితార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. మైత్రి ఆశ్రమం వారు అన్నదానం నిర్వహించారు. అర్చకులు కొండపల్లి సత్యనారాయణ, ధర్మ ప్రచార కర్తలు చింతల మురళీకృష్ణ, పడమట వెంకటేశ్వరరావు, మండవ రమేష్, బాలకృష్ణ, పావులూరి వరలక్ష్మి, గంటా నిర్మల, ఇందిర, నాగమల్లేశ్వరరావు, పావులూరి రమేష్, తమన సాంబశివరావు, హరే శ్రీనివాస భజన సంఘం వారు పాల్గొన్నారు.



గోవాడ శివాలయంలో సామూహిక పారాయణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శ్రీపెదఅంకమ్మతల్లికి ఆలయం వద్ద విశేష పూజలు

కర్లపాలెం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పాతనందాయపాలెంలో వేంచేసియున్న కుంచాలవారి ఇలవేల్పు, శ్రీపెదఅంకమ్మతల్లి ఆలయం వద్ద గ్రామంలోని భక్తులు దీపావళి పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. శ్రీపెద అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో పలు రంగులతో శివలింగాకృతిని ఏర్పాటు చేసి శివలింగం చుట్టూ ప్రమీదలతో దీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. శివలింగాకృతి గ్రామంలోని ప్రజలను విశేషంగా ఆకర్షించింది.

నలుగురు జూదరుల అరెస్టు

కొల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమరవర్ధన్ తెలిపారు. కొల్లూరు కరకట్ట దిగువన ఉన్న కంపోస్టు యార్డులో మంగళవారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ ఆకస్మిక దాడులు చేశారు. దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4950 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.